క్లుప్తంగా

కళలపై దృష్టిసారించాలి



బహుమతులందుకున్న విద్యార్థులతో డీఈవో తిరుమలచైతన్య తదితరులు

కవిటి: విద్యార్థి దశలోనే బాలబాలికలు తమలోని కళాకారుడ్ని మేల్కొలిపి తమ కళా ప్రావీణ్యానికి మెరుగులు దిద్దుకోవాలని డీఈవో ఎస్.తిరుమలచైతన్య అన్నారు. జాతీయ స్థాయి బాల్రంగ్ పోటీల్లో ఆరో స్థానం సాధించిన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంగళవారం జ్ఞాపికలను అందించి సత్కరించారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల సిబ్బందిని అభినందించారు.

వినతులు తక్షణం పరిష్కరించండి

- పలాస ఆర్డీవో వెంకటేష్



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో వెంకటేష్

నందిగాం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలని పలాస ఆర్డీవో జి.వెంకటేష్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం స్థానంలో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో స్థల పరిశీలన చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. వినతులను పరిష్కరించాలన్నారు. అంతకుముందు దేవాడ, నర్సిపురం గ్రామాల్లో నాలా కోసం పెట్టిన దరఖాస్తుల మేరకు ఆయా గ్రామాల్లో పర్యటించి స్థలాలను పరిశీలించారు. తహసీల్దార్ సోమేశ్వరరావు, డీటీ రామారావు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



భూసార ఫలితాల పత్రాలు అందజేస్తున్న దృశ్యం

సోంపేట: రైతులు రబీ సీజన్‌లో భూసారఫలితాలు ప్రకారం ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. బారువ రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మంగళవారం నిర్వహించారు. మట్టి నమూనాలు సేకరించిన రైతులకు భూసార పరీక్ష ఫలితాలు అందజేశారు. భూసార ఫలితాలు ఆధారంగా సిఫారుసు మేరకు ఎరువులు వాడితే సాగు ఖర్చుతగ్గుతుందని, భూసారం పరిరక్షించబడుతుందన్నారు. వ్యవసాయ సహాయకులు పవిత్ర, లోలాక్షి, పలువురు రైతులు పాల్గొన్నారు.

సారాను పూర్తిగా నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ బేబి

కంచిలి: ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న సారాను పూర్తిగా నిరోధించాలని సోంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బేబి పేర్కొన్నారు. మండలంలోని మఠం సరియాపల్లి సచివాలయం వద్ద మంగళవారం సాయంత్రం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారాను అరికట్టే విషయమై స్థానికులకు అవగాహన కల్పించారు. సారా తాగడం వలన కలిగే అనర్థాలను వివరించారు. సారా రవాణా, అమ్మకాలను ప్రోత్సహించరాదని సూచించారు. ఎక్సైజ్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వజ్రపుకొత్తూరు రూరల్: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్, ఉద్యానశాఖాధికారి సునీత అన్నారు. చీపురుపల్లి గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఉద్దాన ప్రాంత ప్రజల జీవనాధారమైన జీడితోటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. పూత, పిందె దశలో పంటను ఆశించే తెగుళ్లు, చీడపీడలను నివారించేందుకు తీసకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ అధికారులు అవినాష్, రమ్య, ఆశాలత ఉన్నారు.

ప్రజలకు దూరంగా..
విద్యుత్ సిబ్బంది!

- మండల కేంద్రానికి మారని ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం
- ఫిర్యాదులకు అవకాశం లేక వినియోగదారుల అవస్థలు



కవిటిలోని విద్యుత్ సబ్‌స్టేషన్



కవిటిలో నూతనంగా నిర్మించిన విద్యుత్‌శాఖ కార్యాలయ భవనం

కవిటి: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాల్సిన విద్యుత్ శాఖ సిబ్బంది అందుకుభిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యుత్ పరంగా సమస్యలు తలెత్తే సమయంలో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కవిటి మండల కేంద్రంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండాల్సిన విద్యుత్ శాఖ అధికారులు దూరంగా ఉంటూ సేవలందిస్తున్నారు. ఇదే అంశంపై పలుమార్లు మండల పరిషత్ పాలకవర్గ సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించారు. ఇందుకు ఆ శాఖకు సంబంధించిన అధికారులు కవిటిలో సబ్ స్టేషన్ లేదని, కనీసం కార్యాలయం కూడా లేదని సమాధానం చెబుతూ దాటవేసేవారు. అయితే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కవిటి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో విద్యుత్ కేంద్రం, దానికి ఆనుకొని ఓ మంచి భవనాన్ని కూడా నిర్మించారు. కానీ ఇక్కడికి వచ్చేందుకు సంబంధిత శాఖ అధికారులు ఎందుకో జాప్యం చేస్తున్నారు. కార్యాలయం లేనప్పుడు అదే అంశాన్ని భూతద్దంలో చూపిన విద్యుత్ శాఖ అధికారులు.. ఇప్పుడు అన్నీ ఉన్నప్పటికీ ఇక్కడకు రావడానికి ఎందుకో మొహం చాటేస్తున్నారు. కవిటి మండలంలో వ్యవసాయ, వాణిజ్య, వాణిజ్యేతర, గృహాలకు సంబంధించి సుమారు 25 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీరికి బొరివంక, రాజపురం, కవిటి గ్రామాల్లో మూడు ఉప విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. అయితే కవిటిలో మండల ట్రాన్స్ కో ఏఈ ప్రధాన కార్యాలయం లేకుండాపోయింది. మండల కేంద్రంలో ఏఈ కార్యాలయం ఏర్పాటు చేస్తే వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. సమస్యలు ఉత్పన్నమైతే సంబంధిత అధికారి దృష్టికి సకాలంలో తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. సమస్య పరిష్కారానికి సిబ్బందికి కూడా సులువుగా ఉంటుంది. వాస్తవానికి 132 /33 కేవీ సబ్ స్టేషన్ ఇచ్ఛాపురంలో ఉంది. ఇక్కడ నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు, ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి విద్యుత్ సరఫరా జరుగుతుంది. మిగతా అన్నిచోట్ల ట్రాన్స్ కో ఏఈ కార్యాలయాలు మండల కేంద్రాల్లో ఉంటే ఒక్క కవిటిలో మాత్రం రాజపురంలో నిర్వహిస్తున్నారు. ప్రజలు తమ అవసరాల కోసం అక్కడ ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళితే అధికారులు అందుబాటులో లేకపోవడంతో సమస్యల పరిష్కారంలో జాప్యానికి కారణం అవుతుంది. కనీసం కవిటిలో వినియోగదారులకు అవసరమైన ప్రత్యేక మొబైల్ నంబర్‌ను సైతం సబ్‌స్టేషన్‌కు కేటాయించలేదు. దీంతో మూడు బ్రేక్ డౌన్లు, ఆరు ఎల్‌సీలుగా విద్యుత్ కోతలు నిరంతరం కవిటిలో ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కవిటి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కార్యాలయ భవనానికి ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయాన్ని మార్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వేసవిలో విద్యుత్ సమస్యలు అధికంగా ఉంటాయి. కాబట్టి అధికారులు స్పందించి సకాలంలో ఏఈ కార్యాలయాన్ని కవిటి మండల కేంద్రానికి తరలించాలని సూచిస్తున్నారు.

ఏఈ కార్యాలయాన్ని మార్పు చేయాలి



కవిటి మండల కేంద్రంలో ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం ఏర్పాటుచేస్తే పారదర్శకంగా వినియోగదారులకు సేవలు అందించే వెసులుబాటు ఉంటుంది. అన్ని మండలశాఖల అధికారులు అందుబాటులో సమన్వయంతో పనిచేసుకోవచ్చు. కవిటికి కార్యాలయం మార్చాలి.

– పొందవ చంద్రశేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు, కవిటి

యాదవులను బీసీ-బీగా మార్చాలని వినతి



కమిషనర్ శంకర నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ఉత్తరాంధ్రా జిల్లాల్లో నివసిస్తున్న యాదవులను తూర్పు యాదవులుగా భావించి బీసీ-బీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు వెనుకబడిన సంక్షేమశాఖ కమిషనర్ శంకర్ నారాయణను విజయవాడలోని తన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని యాదవుల జీవన చిత్రాన్ని కమిషనర్‌కు వివరించారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో ఉన్న యాదవులంతా సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బాగా వెనుకబడి ఉన్నారన్నారు. వీరిని గొల్లలుగా పిలుస్తుంటారని, ఇప్పటికీ కులవృత్తులపైనే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారని కమిషనర్‌కు ఎమ్మెల్సీ వివరించారు. వీరి జీవితాలలో మార్పు లభించి ఉన్నత స్థితి పొందాలంటే వీరిని ప్రత్యేకంగా గుర్తించి బీసీ–డీ నుంచి బీసీ-బీ జాబితాలో చేర్చాలని అభ్యర్థించారు. కమిషనర్ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ రామారావు తెలిపారు.

'గాదె' విజయం చారిత్రాత్మకం



విజయోత్సవంలో ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు విజయం చారిత్రాత్మకమని ఏపీటీఎఫ్ (1938) వజ్రపుకొత్తూరు మండల శాఖ ప్రతినిధులు అన్నారు. శ్రీనివాసులు నాయుడు విజయోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం వజ్రపుకొత్తూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మామిడి భుజంగరావు, మండల శాఖా అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గున్న సుభాష్, సభ్యులు శోభన్, ఉదయ్, కృష్ణారావు అప్పారావు, రవి, నవీన్, ప్రమోద్, సురేష్, చంద్రశేఖర్, మోహన్‌రావు ఉన్నారు.

సాయం చేసి..అండగా నిలిచి..



ఇచ్ఛాపురం: జ్యోతికి సాయాన్ని అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు



కంచిలి: నరేష్‌కు సాయాన్ని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఇచ్ఛాపురం:

ఆటో కార్మికుడు రెల్ల గోపీ ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబానికి తోటి ఆటోకార్మిక యూనియన్ సభ్యులు అండగా నిలిచారు. 50 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని పురపాలకసంఘం పరిధిలోని ముత్యాలమ్మపేట వద్ద నివాసముంటున్న మృతుని భార్య జ్యోతికి మంగళవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో భగవతి శ్రీస్వేచ్ఛావతి ఆటో ఒనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బడే మోహన్‌రావు, ఉలాసి ఎర్రయ్య, పైల మోహన్‌రావు, పూర్ణచంద్రసాహు, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన కుందల నరేష్ గొంతు క్యాన్సర్‌తో కొన్నాళ్లుగా బాధపడుతున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వారు తమవంతు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. పది వేల రూపాయలను సేకరించి బాధితుడుకి మంగళవారం అందజేశారు. సంస్థ సభ్యులు పైల వెంకట్, నీలాపు వంశీ, నీలాపు కిరణ్, దల్లి సాయి, అశ్విన్ అడ్డాల ఉన్నారు.

ఉద్యోగ, కార్మిక వర్గాల హక్కుల కోసం పోరాడుతా

- ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు



శ్రీనివాసులునాయుడును దుశ్శాలువతో సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్యోగ, కార్మిక వర్గాల హక్కుల కోసం పోరాడుతానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన తొలిసారిగా మంగళవారం రాత్రి ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం లొద్దపుట్టిలోని ధనరాజుల తులసమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ, ఆపస్, ఏపీటీఎఫ్–138 సంఘ నాయకులు ఆయనకు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలు అత్యంత పటిష్టమైనవని, నిబద్ధత గలవని, పోరాట పటిమకు పేరుగాంచాయని అన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ వర్గాలతో పాటు మిగిలిన ఉద్యోగ, కార్మిక వర్గాల హక్కుల కోసం పోరాడుతానని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు మాసుపత్రి చంద్రశేఖర్, ఎల్.గోవిందరావు, కీలు సోమేశ్వరరావు, బి.శంకరం, యల్లారావు, సుధాకర్, పీస లోహిదాసు, వెంకటరమణ, వజీర్ అహ్మద్, శ్యామ్, పద్మనాభం, జాడు ప్రకాశరావు పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయం వద్ద మరుగుదొడ్డి నిర్మాణం



సాక్షి ఎఫెక్ట్...

మరుగుదొడ్డి నిర్మాణానికి ఇటుకలను తీసుకెళ్తున్న కార్మికులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిని మెప్మా కార్యాలయం ఆవరణలో మరుగుదొడ్డి నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. 12 వేల మందికి పైగా స్వయంశక్తి సంఘాల సభ్యులు నిత్యం ఈ కార్యాలయానికి వస్తుంటారు. కనీసం మరుగుదొడ్డి లేకపోవడంతో అత్యవసర సమయంలో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అత్యవసరంగా నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు వచ్చాయి. మంగళవారం నుంచి మెప్మా కార్యాలయం మేపపైన మరుగుదొడ్డి నిర్మాణ పనులు ప్రారంభించారు.

తీరంలో చెత్త తొలగింపు



జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు మత్స్యకార తీరప్రాంతంలో మంగళవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. బీచ్‌కు వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా ఉండటంతో సర్పంచ్ బుడ్డ మోహనాంగి ప్రొక్లయినర్‌ను ఏర్పాటు చేసి చెత్తా, చెదారం, సముద్రం గుల్లలను తొలగించారు.

ఎల్లమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస పట్టణంలో ఈ నెల ఎనిమిదో తేదీన జరగనున్న ఎల్లమ్మతల్లి జాతర మహోత్సవ ఏర్పాట్లను పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు మంగళవారం పరిశీలించారు. జాతరకు సుమారు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని కమిషనర్ చెప్పారు. ఇన్, అవుట్ గేట్లతో పాటు, దుకాణాల ఏర్పాటుకు స్థలం కేటాయింపు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎల్లమ్మ దర్శనానికి పరిమితంగా పాస్‌లు విడుదల చేయడంతో పాటు పోలీసులు, ఇతర అధికారులతో మరో సారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ఆలయ నిర్వహణ కమిటీకి సూచించారు.

సిమెంట్ బెంచీల వితరణ



సంతబొమ్మాళి మండలంల బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు జి.జగదాంబ సిమెంట్ బెంచీ, కుర్చీలను వితరణగా మంగళవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి.రామకష్ణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, దాతలు పాఠశాల అభివద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయిని జగదాంబను తోటిసిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు. ఉపాధ్యాయులు బాడాన రాజు, టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

అమ్మవారి సంబరం



ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారి సంబరాలు మంగళవారం వైభవంగా జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకునేక్రమంలో అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో బాజాభజంత్రీలతో బాణసంచా కాలుస్తూ కవిటి పట్టణ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. యువత నృత్యాలు చేస్తూ కాళీమాత వేషధారులు లయబద్ధంగా చేసిన నృత్యం చూపరుల్ని కనువిందు చేసింది. అనంతరం పట్టణ శివార్లలో ఉన్న అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు.

–కవిటి

పరీక్ష కేంద్రం పరిశీలన



కంచిలి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలను స్థానిక తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును, సౌకర్యాలపై ఆరా తీశారు. డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణప్రసాద్ రాకో ఉన్నారు.

–కంచిలి

మహిళా చట్టాలపై అవగాహన



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సోంపేట ఎస్ఐ లవరాజు అన్నారు. పట్టణంలోని కొంచాడ జగన్నాథం ప్రైవేటు కళాశాలలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా చట్టాలపై విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తే దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో పోలీసు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

–సోంపేట

మంచుకురిసే వేళలో..



టెక్కలి పరిసరాలను మంగళవారం ఉదయం పొగ మంచు దట్టంగా కమ్మేసింది. దీంతో వాహనదారులు, మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లినవారు ఇబ్బందిపడ్డారు. వాహనదారులు లైట్లను వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది. కాగా దట్టంగా కురుస్తున్న మంచుతో మామిడి, జీడిపూత మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

–టెక్కలి రూరల్

రైస్ మిల్లులో ప్రమాదం

- వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం చిన్న బమ్మిడి పంచాయతీ పరిధిలో గల శ్రీవెంకటేశ్వర మోడ్రన్ రైస్‌మిల్లులో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో చిన్నబమ్మిడి గ్రామానికి చెందిన గొండు రాజారావు (34) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిల్లులో ధాన్యం ఆడుతున్న సమయంలో ఒక బస్తా తొట్టిలో వేసి మరో బస్తా తెచ్చేందుకు వెళ్తుండగా కాలు జారి ప్రమాదవశాత్తు ధాన్యాన్ని నిల్వ చేసే అండర్ గొడౌన్‌లో రాజారావు పడిపోవడంతో తీవ్రగాయాలకు గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు మిల్లు యజమానికి, 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది వచ్చి రాజారావుని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కోటబొమ్మాళి ఎస్ఐ సత్యన్నారాయణ ఘటనస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై మంగళవారం కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య జగదీశ్వరి, గీతా మాధురి, తేజ అనే ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

ఉపాధి కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితి ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధినిచ్చే స్వల్ప కాలిక కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ పైల జవహర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వెల్డింగ్, సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సులో చేరేందుకు పదో తరగతి, ఆపై విద్యార్హతలు కలిగి 18 నుంచి 30 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఫొటో, ఆధార్‌కార్డుతో కళాశాల పని వేళల్లో తమను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం హబ్ కోఆర్డినేటర్ 63010 46329 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.